

పెళ్లయిన గంటల్లోనే విషాదం

- వధువును హతమార్చి.. వరుడి ఆత్మహత్య
- వాట్సాప్ చాటింగా, మరేదైనా కారణమా?
- కర్ణాటక పరిధిలో ఘటన
- అబ్బాయిది శాంతిపురం మండలం సంతూరు గ్రామం

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 8: అబ్బాయిది శాంతిపురం మండలం సంతూరు. అమ్మాయిది కర్ణాటక రాష్ట్రం బైనహళ్లి. పెళ్లయింది బుధవారం ఉదయం చంబరసనహళ్లి గ్రామంలో. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే గదిలో నవదంపతుల మధ్య ఏం జరిగిందో కానీ.. కొడవలి దాడిలో తీవ్రంగా గాయపడిన వధువు నిఖితశ్రీ మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వరుడు నవీన్(30) చికిత్స పొందుతూ గురువారం ఉదయం అసువులు బాశాడు. వీరి మృతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె వాట్సాప్ చాటింగ్.. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడం కారణాలుగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి. శాంతిపురం మండలం సంతూరు గ్రామానికి చెందిన జయమ్మ, మునెప్ప దంపతుల కుమారుడు నవీన్. ఇతడి సోదరికి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా చంబరసనహళ్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్య..కర్ణాటక సరిహద్దు గ్రామమైన రాజుపేటక్రాస్‌లో నవీన్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బైనహళ్లికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మి దంపతుల కుమార్తె నిఖితశ్రీతో ఇతడికి బుధవారం ఉదయం చంబరసనహళ్లి (వరుడి సోదరి గ్రామం)లో వివాహమైంది. కొంతసేపటి తర్వాత నిఖితశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులను గ్రామంలోని తన అక్క ఇంటికి నవీన్ తీసుకెళ్లాడు. ఆ తర్వాత నవదంపతులు ఓ గదిలోకి వెళ్లారు. కొంతసేపటికే వారి గదిలో నుంచి కేకలు వినిపించాయి. నవీన్ మేనకోడలు కిటికీలో నుంచి చూడగా నిఖితపై అతడు కొడవలితో దాడి చేయడం కనిపించింది. వెంటనే బంధువులు గది తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే నిఖిత రక్తపుమడుగులో.. పక్కనే నవీన్ తీవ్రగాయాలతో పడున్నారు. వీరిద్దరినీ కోలారులోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే నిఖిత మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నవీన్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అండర్‌సన్ పోలీసులు తెలిపారు. కాగా, ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్న నవీన్.. భార్యను చంపి, తాను ఆత్మహత్యకు పాల్పడటంపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

గ్రామంలో విషాదం

జనసేనలో క్రియాశీల కార్యకర్తగా, సౌమ్యుడిగా పేరున్న నవీన్ జీవితం విషాదాంతం కావడం స్థానికులను బాధకు గురిచేసింది. సున్నిత మనస్కుడైన ఇతడు.. ఎవరికీ హాని కలిగించే మనస్తత్వం కాదని స్నేహితులు, జనసేన శ్రేణులు చెప్పారు. అలాంటి వ్యక్తి ఎందుకిలా చేశాడో అర్థం కావడం లేదన్నారు. కాగా నిఖిత అంత్యక్రియలు బైనహళ్లిలో,నవీన్ అంత్యక్రియలు చంబరసనహళ్లిలో జరిగాయి.



వివాహ సమయంలో నిఖిత, నవీన్

ఘటన వెనుక ఏం జరిగింది?

ఈ ఘటనపై స్థానికంగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా నవీన్ మానసిక పరిస్థితి సరిగాలేదని, దీనివల్లే ఈ ఘటన జరిగి ఉండచ్చొని కొందరు చెబుతున్నారు. వధువు సెల్‌ఫోను చాటింగే కారణమని అతడి సన్నిహితులు చెబుతున్నట్లు తెలిసింది. పెళ్లయిన కొద్దిసేపటికే నిఖిత సెల్‌ఫోనులో చాటింగ్ చేయడాన్ని అతడు గమనించాడని అంటున్నారు. అనుమానంతో ఆమె ఫోను తీసుకుని చూడగా ఓ యువకుడితో చాట్ చేసినట్లు గుర్తించాడని చెబుతున్నారు. దీంతో గదిలోకి వెళ్లగానే దీనిపై ప్రశ్నించడం.. ఆ నేపథ్యంలోనే ఆమెపై దాడి చేసి హతమార్చి.. తానూ ఆత్మహత్యకు యత్నించి ఉంటాడని భావిస్తున్నారు.

హెడ్‌క్వార్టర్స్‌కు చిత్తూరు డీఎస్పీ



చిత్తూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌ను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు నాయుడుపేట నుంచి చిత్తూరుకు వచ్చిన ఈయన.. ఎన్నికల సమయంలో వైసీపీ కోసం ఏకపక్షంగా పనిచేసినట్లు ఆరోపణలున్నాయి. వైసీపీ హయాం ఐదేళ్లలో రామచంద్రాపురం, నాయుడుపేట వంటి కీలక సబ్‌డివిజన్లలో పనిచేసిన ఈయన ఎన్నికలకు ముందు చిత్తూరు వచ్చారు. ఈయన వచ్చినప్పటి నుంచి టీడీపీ శ్రేణులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈయన తీరు మారలేదని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మురళీమోహన్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కీలక పోస్టింగ్ కోసం ఈయన ప్రయత్నించినా కుదరలేదు. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఈయన స్థానంలో ఒకట్రెండు రోజుల్లో కొత్త డీఎస్పీని నియమించే అవకాశాలున్నాయి.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

- ఏడు పాఠశాలల్లో జరగని వైనం



చిత్తూరు గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నూతన కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఎం రమేష్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 2458కిగాను 2451 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. కోరం లేకపోవడం, వైసీపీ ఆధిపత్య పోరు కారణంగా ఏడు చోట్ల ఎన్నికలు ఆగాయి. వైసీపీ హయాంలో 2021 సెప్టెంబరు 22న పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు జరగ్గా.. వీటి పదవీ కాలం గతేడాది సెప్టెంబరుతో ముగిసింది. అప్పటి ప్రభుత్వం మరో ఏడాది పాటు వీటి పదవీ కాలం పొడిగించింది. ఇప్పుడు కొత్త కమిటీల నియమకానికి కూటమి ప్రభుత్వం ఎన్నికలు చేపట్టింది. జిల్లాలోని 2458 పాఠశాలలకు గాను 2451 పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు 1867 ఉండగా 1864 పాఠశాలల్లో, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు 170కి గాను 169, జడ్పీ ఉన్నత పాఠశాలలు 291కి గాను 288 చోట్ల ఎన్నికలు జరిగి కొత్త కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ ఎస్‌ఎంసీ ఎన్నికలకు వీఆర్వో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పరిశీలకులుగా వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక పాఠశాలల్లో పోలీసు బందోబస్తునూ ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్లకు ప్రాధాన్యం

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో రిజర్వేషన్లకు ప్రాధాన్యమిచ్చారు. ఎస్‌ఎంసీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవిలో ఏదో ఒకటి ఎస్సీలకు కేటాయించగా, మరొకటి బీసీ, జనరల్‌కు కేటాయించారు. ప్రతి తరగతి కమిటీలో ముగ్గురు సభ్యులకు గాను ఒకటి ఎస్సీ, ఒకటి బీసీ, ఒకటి జనరల్ విభాగాలకు కేటాయించారు. తరగతి కమిటీలో ఇద్దరు మహిళలు ఖచ్చితంగా ఉండేలా నిబంధనలు పాటించారు.

కొత్త కమిటీల తొలి సమావేశం

తరగతి కమిటీలు, పాఠశాల స్థాయి కమిటీ ఎన్నిక పూర్తి కాగానే ఎన్నికల అధికారి, పాఠశాల హెచ్‌ఎం నూతనంగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతో ప్రమాణం చేయించారు. అనంతరం తొలి సమావేశం జరిగింది. కమిటీల విధులు,హక్కులు, పాఠశాల అభివృద్ధి, ప్రయోజనాల గురించి పాఠశాలల హెచ్‌ఎంలు వివరించారు.

ఎన్నికలు నిలిచిన పాఠశాలలివే

కుప్పం మండలంలో మంకలదొడ్డి ప్రాథమిక పాఠశాల, వసనాడు జడ్పీ ఉన్నత పాఠశాల, పాలసముద్రం మండలం తిమ్మరాజపురంలో ప్రాథమికోన్నత పాఠశాల, ఎస్‌ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్టలోని జడ్పీ ఉన్నత పాఠశాల, నిండ్ర మండలం కొప్పేడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, యాదమరి మండలం కొట్టాలం జడ్పీ ఉన్నత పాఠశాల, బైరెడ్డిపల్లె మండలం కీలపొరాడి ప్రాథమిక పాఠశాల.



రాజేష్‌ను అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ

'డాయ్ యాప్' కేసులో ఒకరి అరెస్టు

పలమనేరు, ఆగస్టు 8: పలమనేరు ప్రాంతంలో డిపాజిట్లపై రెట్టింపు ఇస్తామంటూ ప్రజలను మోసగించిన 'డాయ్ యాప్' కేసులో మెప్మాలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ విష్ణురఘువీర్ తెలిపారు. పలమనేరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గంగవరం మండలంలోని మామడుగు సమీపంలో రాజేష్ ఉండగా పలమనేరు సీఐ చంద్రశేఖర్ అరెస్టు చేశారన్నారు. '2024 జనవరిలో రాజేష్‌కు బాలసుబ్రమణ్యం అనే వ్యక్తి వాట్సాప్ ద్వారా పరిచయమయ్యాడు. డాయ్ యాప్ ద్వారా రూ.1000 జమ చేస్తే రోజుకు రూ. 43 వస్తుందని వివరించాడు. దీంతో రాజేష్ ప్రాథమికంగా రూ.300 జమచేశాడు. దీనికిగాను రెండు రోజులకు రాజేష్‌కు రూ.360 వచ్చింది. ఇంకా ఎక్కువ సంపాదించాలని రాజేష్ భావించారు. ఈ యాప్ ద్వారా ఎక్కువ మందిని చేర్పిస్తే ఎక్కువ కమీషన్ వస్తుందని తెలిసి తన స్నేహితులను, మెప్మాలో పనిచేసే వారిని దాదాపు 375 మందిని డాయ్‌యాప్‌లో చేర్పించాడు. ఇలా చేరిన వారు మరికొందరిని ప్రోత్సహించడంతో పలమనేరు ప్రాంతానికి చెందిన వారు దాదాపు రూ.5.82 కోట్లు డాయ్‌యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. వాట్సాప్‌లో పరిచయమైన బాలసుబ్రమణ్యం, టీనా, రాజేష్, కుమార్ మరికొంత మంది డాయ్‌యాప్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ సౌకర్యం ఉందని, 15 రోజులకుగాను కొంతమొత్తం డిపాజిట్‌చేస్తే చేసిన మొత్తంలో 43 శాతం అదనంగా నగదు ఇస్తారని చెప్పారు. ఈ డాయ్ యాప్‌కు రాజేష్ రూ.31,43,000 కట్టగా తిరిగి రూ.12,55,968 వచ్చింది. దీంతో రాజేష్ పలమనేరులో అవగాహన సదస్సులు నిర్వహించి డాయ్ యాప్ పెట్టుబడులను ప్రోత్సహించారు. అంతకు ముందు డబ్బులు కట్టిన కొంతమందికి కమీషన్ వచ్చినట్లు ఆ అవగాహన సదస్సుల్లో నగదు ఇచ్చారు. దీన్ని చూసి పలువురు పెద్ద మొత్తంలో డాయ్‌యాప్‌లో డిపాజిట్ చేశారు. గతనెల 27న తమ సెల్‌ఫోన్లలో డాయ్‌యాప్ అదృశ్యం కావడంతో డబ్బులు కట్టినవారు రాజేష్‌ను నిలదీశారు. అతడు సరైన సమాధానం ఇవ్వక పోవడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి గత నెల 29, 30 తేదీల్లో ముగ్గురు అధికారుల బృందం ద్వారా బాధితుల నుంచి ఫిర్యాదులు సేకరించారు. ఈ నేపథ్యంలో పరారీలో ఉన్న రాజేష్‌ను బుధవారం అరెస్టు చేశాం' అని డీఎస్పీ విష్ణు రఘువీర్ వివరించారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు చేస్తున్నామని, మెప్మా సిబ్బందిని కూడా విచారిస్తామని తెలిపారు. కాగా నాగాలాండ్, ఉయ్యూరులోను డాయ్‌యాప్ ద్వారా ప్రజలను మోసగించడంతో అక్కడా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇలాంటి యాప్‌ల బారిన పడి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు.

పలమనేరు మాజీ ఎమ్మెల్యేపై చీటింగ్ కేసు

పలమనేరు, ఆగస్టు 8: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడపై గురువారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పలమనేరు మండలం మాదిగబండ సమీపంలోని తన క్వారీలో ఈనెల 6వ తేదీ రాత్రి మూడు టిప్పర్లు, రెండు హిటాచీలు, ఒక ఎక్స్‌కవేటర్‌ను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తీసుకెళ్లిపోయారంటూ జనార్దన నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు వెంకటేగౌడపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీరప్పకుంటలో వైసీపీ నేత ఆక్రమణలు

- తొలగించిన రైతులు





భీమగానిపల్లె క్రాస్ వద్ద వైసీపీ నేత చేపట్టిన చెరువు ఆక్రమణను తొలగిస్తున్న రైతులు - కందకం తీయిస్తున్న రైతులు

పుంగనూరు, ఆగస్టు 8: పుంగనూరు మండలం భీమగానిపల్లె క్రాస్‌లోని వీరప్పకుంటను వైసీపీ నేత ఆక్రమించి వెంచర్ వేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ చర్యకు పాల్పడగా.. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో రైతులు గురువారం ఎక్స్‌కవేటర్‌తో ఆ ఆక్రమణలను తొలగించారు. స్థానిక బైపాస్‌రోడ్డు శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద భీమగానిపల్లె వైసీపీ నేత, మాజీ ఎంపీటీసీ హేమచంద్ర వీరప్పకుంటలో విలువైన చెరువు స్థలం, ప్రభుత్వ భూమి ఆక్రమించి వెంచర్ వేశారని స్థానికులు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువు ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో గురువారం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు, టీడీపీ నాయకులు కలసి ఆక్రమణకు గురైన వీరప్పకుంట స్థలంలోని ప్రహరీని, చదును చేసిన మట్టిని తొలగించి చెరువు చుట్టూ కందకం తవ్వించారు. చెరువు ఆక్రమణ వల్ల వర్షపునీరు నిల్వ లేకుండా పోవడంతో పంటలకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీనిపై ఇప్పుడు అధికారులకు ఫిర్యాదు చేయగా కుంట చుట్టూ కొలతలు వేసి ట్రెంచ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారన్నారు. దీంతో ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ విషయంపై మాజీ ఎంపీటీసీ హేమచంద్ర మాట్లాడుతూ.. తాను చెరువు ఆక్రమణలకు పాల్పడలేదని, స్థలాన్ని కొనుగోలు చేసిన రికార్డులు ఉన్నాయన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించాలి



మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని చిత్తూరు పీస్ ఫౌండేషన్ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ.. అక్కడి మృతులకు గురువారం సాయంత్రం చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పొరుగు దేశంలో పది రోజులుగా అల్లర్లు, దోపిడీలు, లూటీలు, గృహ దహనాలు, హత్యలు జరుగుతుండటం.. అక్కడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. దాడుల్లో చనిపోయిన వారి ఆత్మశాంతికి నివాళులర్పించిన వారిలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, బ్రహ్మానందం, రామభద్ర, సునీల్, ఉదయ్ తదితరులున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)

'ప్రకృతి సాగు' పొలాల్లో మెక్సికో ప్రొఫెసర్



సేంద్రియ ఎరువుల తయారీ గురించి మెక్సికో ప్రొఫెసర్ లాజస్‌కు వివరిస్తున్న రైతు కృష్ణమూర్తి

మెక్సికో దేశానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎలీనా లాజస్ గురువారం కుప్పం మండలంలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించారు. ఏ గ్రేడ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానం, యూనివర్సల్ మోడల్‌లో సాగవుతున్న వేరుశనగ పంటను జి.కృష్ణమూర్తి పొలంలో చూశారు. ఎన్‌పీఎం షాప్ వద్ద తులనుపరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. సాగులో తాను అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతు కృష్ణమూర్తి ఆమెకు వివరించారు. ప్రొఫెసర్ లాజస్‌కు జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, ఎస్పీఎం సురేంద్ర, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, ఏడీపీఎం శ్రీనివాసులు ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. ఎన్ఎఫ్ఏ గురుప్రసాద్ పాల్గొన్నారు.

- కుప్పం

వరసిద్ధుడి సేవలో సినీ నటుడు

కాణిపాకం(ఐరాల), ఆగస్టు 8: వరసిద్ధి వినాయకస్వామిని గురువారం సినీ నటుడు సంతోష్ శోభన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ వారికి దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

రూ.11 కోట్లతో ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం రూ.11 కోట్ల ప్రోత్సాహక నిధులను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎండీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), జాతీయ వంట నూనెల మిషన్, ఆయిల్ పామ్, కొబ్బరి అభివృద్ధి పథకం కింద మామిడి, చీని, దానిమ్మ, జామ, అరటి, బొప్పాయి, చింత, నేరేడు ముంతమామిడి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఫిగ్, ఫాషన్ ఫ్రూట్ సాగుకు 40 శాతం సబ్సిడీ అందించనుంది. 668.60 హెక్టార్లలో పాలీ హౌస్‌లకు రూ.1.98 కోట్లు కేటాయించింది. చిన్న ట్రాక్టర్లు, టిల్లర్లు, ట్రాక్టర్‌తో నడిపే స్ప్రేయర్లు తదితర పరికరాలను 40-50 శాతం సబ్సిడీపై ఇచ్చేందుకు రూ.13.87 కోట్లు కేటాయించింది. కోల్డ్ రూంల ఏర్పాటుకు రూ.3.54 కోట్లు, పూల తోటల సాగుకు రూ.72 లక్షలు, కూరగాయల సాగుకు రూ.8 లక్షలు, నగరి, నింద్ర, కార్వేటినగరం, విజయపురం, ఎస్ఆర్ పురం, జీడీ నెల్లూరు మండలాల్లో 300 హెక్టార్లలో రూ.72 వేల సబ్సిడీతో ఆయిల్ పామ్ ఏర్పాటు చేయనుంది. బిందు, తుంపర్ల సేద్యానికి 70-90 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఉద్యాన పంటల సాగు అభివృద్ధి చేయాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి జిల్లా రైతాంగాన్ని కోరారు.

పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 8: పీఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 5 శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణం అందే అవకాశం ఉందని తెలిపారు. వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, శిల్పులు, రాతి, తాపీ పనివారు, బుట్టలు, చాపలు, చీపుర్లు, తాళ్లు అల్లేవారు, సంప్రదాయ బొమ్మలు చేసేవారు, క్షురకులు, పూలదండలు చేసేవారు, లాండ్రీ, చేపల వలలు, పనిముట్లు, తాళాలు తయారు చేసేవారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దిరెడ్డిపై అనర్హత కేసు 14కు వాయిదా

పుంగనూరు, ఆగస్టు 8: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తుల వివరాలు పొందుపరచక పోవడంతో అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టులో దాఖలైన కేసు విచారణ ఈనెల 14కు వాయిదా పడింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ కేసు విచారణను 14కు వాయిదా వేసినట్లు పిటీషనర్ బీసీవైపార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తెలిపారు.

'మెప్మా'కు కొత్త సిబ్బంది

● 'డాయ్ యాప్'తో 19 మంది తొలగింపు పర్యవసానం



మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు కలెక్టర్ ఉత్తర్వులు అందజేస్తున్న ఉద్యోగులు

పలమనేరు, ఆగస్టు 8: 'డాయ్ యాప్' కేసులో పలమనేరులోని మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బంది, 14 మంది ఆర్పీలను తొలగించారు. కాగా, కార్యాలయ నిర్వహణ కోసం తాత్కాలికంగా తిరుపతి మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్, సీవో ధనలక్ష్మిని నియమించారు. రెగ్యులర్ సిబ్బంది నియామకం జరిగే వరకు వీరు ఇక్కడే కొనసాగనున్నారు. వీరిద్దరితో పాటు గురువారం తిరుపతి మెప్మా కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ పి. శ్రీనివాసులు కూడా ఇక్కడికి వచ్చారు. పలమనేరు కార్యాలయానికి ఇన్‌చార్జిగా నియమితులైన వి.బాబా ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, 19 మందిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరు జారీ చేసిన ఉత్తర్వులను గురువారం వారికి అందజేశారు. ఇందులో పలమనేరు మెప్మా సిటీ మేనేజర్ ఉమేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్, కార్యాలయ సిబ్బంది మయూరి, జయంతి, గుల్షన్‌లతో పాటు ఆర్పీలు వలర్మతి, లక్ష్మీదేవి, బేబి, రాణి, జరీంతాజ్, శిరీష, ప్రసన్నకుమారి, పుష్పలత, రెడ్డెమ్మ, విమల, జయలక్ష్మి, నగీనా, దివ్య, ఎడీన ఉన్నారు.

2040లో చంద్రుడి మీదకు అతి తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాం

అంతరిక్ష వారోత్సవాల్లో ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు అందజేసే ముందు రాకెట్ నమూనా మెమెంటోను ప్రదర్శిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, ఆగస్టు 8: అతి తక్కువ ఖర్చుతో 2040లో మనుషులను చంద్రుడి మీదకు తీసుకెళ్ళేందుకు పరిశోధనలు చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతరిక్ష వారోత్సవాల్లో గురువారం నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన సోమనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్షరంగంలో దేశం ప్రతిష్ఠ పెరిగిందన్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వెళ్లడానికి విమానంలో 30 గంటల సమయం పడుతుందని, అయితే రాకెట్‌లో 30 నిమిషాల్లో చేరేందుకు అమెరికన్ ఇంజనీర్,టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ప్రయోగాలు జరుపుతున్నారన్నారు.ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ యువ శాస్త్రవేత్తలకు ఆదర్శనీయుడంటూ కొనియాడారు. ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ ఇస్రో, ఎస్ఏఆర్ఎల్ సహకారంతో ముందుకెళతామన్నారు.షార్ డైరెక్టర్ రాజరాజన్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్ కుమార్ పాత్ర, ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ నాగరాజరామారావ్, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో టీచర్ల పనిసర్దుబాటు

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం ● ఆదివారానికి పూర్తి చేయాలని లక్ష్యం ● 500 పాఠశాలల్లో జరిగే అవకాశం



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: పాఠశాల విద్యా వ్యవస్థలో టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియకు ప్రభుత్వం అడుగులు వేసింది. శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభించి ఆదివారంతో ముగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటి పరిశీలన నిమిత్తం డీఈవో, డీవైఈవో, ఏడీలను పరిశీలకులుగా నియమించింది. ఎక్కడా అవినీతికి తావులేకుండా పీపుల్- టీచరు రేషియో (పీటీఆర్)లో 2024 ఆగస్టు 7వ తేదీ యూడైస్ ఆధారంగా ఎస్టీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, పీడీ, పీఈటీల పని సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నుంచి హైస్కూల్ ప్లస్ పాఠశాలలను మినహాయించారు. కాగా, జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యానికి సంబంధించి ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పరిధిలో 2463 పాఠశాలలున్నాయి. 35 ప్రభుత్వ, 2331 జడ్పీ, ఎంపీపీ, 53 మున్సిపల్ పాఠశాలల్లో మాత్రమే వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టనున్నారు. 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలా చేపట్టాల్సిన ఈ ప్రక్రియలో కేవలం 500 పాఠశాలల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జరిగే వీలుందని విద్యాశాఖ అధికారుల అంచనా.

ఈ కేటగిరిలకు మినహాయింపు

2025 ఏప్రిల్ 30 నాటికి పదవీ విరమణ పొందే వారితో పాటు వితంతు, పెళ్లికాని మహిళా టీచర్లు, విడాకులు తీసుకున్న వారు, భార్యభర్తలు ఒకే చోట పనిచేస్తున్న కేటగిరి టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు ఇష్టపూర్వకంగా సర్దుబాటుకు అంగీకరిస్తే వారి పరిధిలోని పాఠశాలలకు వెళ్లే వీలు కల్పించారు.

మూడు దశల్లో ప్రక్రియ

శుక్రవారం మండల స్థాయిలో ఎంఈవోలు, శనివారం డివిజన్ స్థాయిలో డీవైఈవో, ఆదివారం జిల్లా స్థాయిలో డీఈవో ఆధ్వర్యంలో ఈ సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. టీచర్లు అధికంగా ఉన్నవారిని గుర్తించి రాష్ట్ర పాఠశాల వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. మండల స్థాయిలో వారిని పిలిపించి వెబ్ ఆప్షన్‌ల మేరకు టీచర్లు అవసరమైన పాఠశాలల ప్రదర్శించి, స్థానాలు ఎంపిక చేసుకునే వెసులుబాటును టీచర్లకు కల్పించారు.

సర్దుబాట్ల ప్రాధాన్యత

సబ్జెక్టుల వారీగా ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లను, 98 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు, 3-8 తరగతులు రెండు భాగాలుగా విభజించి సబ్జెక్టుల వారీగా టీచర్ల సర్దుబాటు చేయాలి. అధికంగా ఉన్న టీచర్లను గుర్తిస్తే సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలలకు అవసరమైన చోట సర్దుబాటు చేయాల్సి ఉంది.

ఇన్‌చార్జిల నియామకం

వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించడానికి పాఠశాల విద్యాశాఖ రెవెన్యూ డివిజన్ల వారీగా ఇన్‌చార్జిలను నియమించింది. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలతో పాటు కుప్పం పరిధిలోని నాలుగు మండలాలకు డీవైఈవో చంద్రశేఖర్ ఇన్‌చార్జిగా ఉంటారు. నగరి రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాలకు డీఈవో దేవరాజు, పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని 10 మండలాలకు డీఈవో కార్యాలయ ఏడీ వెంకటేశ్వరరావు ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు.

రూ.70 లక్షల విలువైన 330 ఫోన్ల రికవరీ



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 8: చాట్‌బాట్ ద్వారా రికవరీ చేసిన రూ.70 లక్షల విలువ చేసే 330 ఫోన్లను ఎస్పీ మణికంఠ గురువారం బాధితులకు అందించారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో చాలా మంది ఫోన్లను పోగొట్టుకుని బాధితులు స్టేషన్లలో, చాట్‌బాట్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేశారు. చాట్‌బాట్ బృంద నిపుణులు మొబైల్ ట్రాకింగ్ ద్వారా ఫోన్లను పట్టుకున్నారు. రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి ఫోన్లను రికవరీ చేశారు. వాటిని గురువారం పోలీసు అతిథి గృహంలో ఎస్పీ మణికంఠ బాధితులకు అందించారు.ఇప్పటివరకు మొదటి దశలో 500, రెండో దశలో 200, మూడవ దశలో 300, నాలుగవ దశలో 200, ఐదవ దశలో 300, ఆరవ దశలో 200 ఫోన్లను, తాజాగా 330 ఫోన్లతో కలిపి రూ.4.30 కోట్ల విలువ చేసే 2,030 ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించారు. ఏఎస్పీ అరీఫుల్లా, క్రైమ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ సిబ్బంది బాహుజీ, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

కైలాస ధామం నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం

● నిర్మాణానంతరమూ సాయమందిస్తానన్న గల్లా రామచంద్రనాయుడు



కైలాస దామాన్ని పరిశీలిస్తున్న రామచంద్రనాయుడు

చిత్తూరు రూరల్, అగస్టు 8: నగరంలోని శ్మశానవాటికలో నగరపాలక సంస్థ సహకారంతో లయన్స్ క్లబ్, ఆర్య వైశ్య సంఘం సంయుక్తంగా నిర్మిస్తున్న కైలాస ధామ(బర్నింగ్ మిషన్)నికి బుధవారం అమరరాజ సంస్థల మాజీ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. విరాళంతో సరిపెట్టకుండా నిర్వాహణ ఖర్చులకు సహాయం అందిస్తానని తెలిపారు. చిత్తూరు జిల్లా అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం కైలాస ధామంతా కలియదిరిగి నిర్వాహకులను అభినందించారు. లయన్స్ గోల్డ్ జోనల్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి మాట్లాడుతూ కైలాసధామం నిర్మాణంలో రామచంద్రనాయుడు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీధరరెడ్డి, ద్వారకనాథ్, శరవణ, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు



పూల రమేష్

చిత్తూరు లీగల్, ఆగస్టు 8: చిన్నారిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి చిత్తూరు న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మదనపల్లె చంద్రకాలనీకి చెందిన పూల రమేష్ భిక్షమెత్తుకుంటూ కాలం గడపుతున్నాడు. అక్కడే నివాసముంటున్న భాగ్యమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకు మూడేళ్ల కుమార్తె ఉంది. తమ ఆనందానికి అడ్డు వస్తుందనే కోపంతో 2017 ఏప్రిల్ 20వ తేదీన ఆ చిన్నారిని హత్య చేయడానికి ప్రయత్నించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు మదనపల్లె పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం పోక్సో కోర్టులో జరిగిన విచారణలో నేరం రుజువుకావడంతో రమేష్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన మహిళకు రెండేళ్ల జైలు



నిర్మల

చిత్తూరు లీగల్, ఆగస్టు 8: ఉద్యోగాల పేరిట పలువురి వద్ద నగదు కాజేసిన మహిళకు కోర్టు రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన సిద్ధయ్య భార్య నిర్మల ఉద్యోగాలు తీసిస్తానని చెప్పి జిల్లాలోని పలువురు యువకుల నుంచి డబ్బు వసూలు చేసింది. దీనిపై 2020లో చిత్తూరు క్రైమ్ పోలీసు స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆ మహిళను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఐదవ కోర్టులో గురువారం విచారణకు రాగా నిర్మలపై నేరం రుజువుకావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ. ఐదువేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీర్తన తీర్పు చెప్పారు.

ఆగని ఏనుగుల విధ్వంసం



ఏనుగుల దాడితో ధ్వంసమైన వరి నార్లు

సోమల, ఆగస్టు 8: పేటూరు పంచాయతీలో బుధవారం రాత్రి ఏనుగుల స్వైర విహారంతో పొలాల్లోని వరి నార్లు ధ్వంసమయ్యాయి. దీంతో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు భయాందోళన చెందుతున్నారు. నాట్లకు సిద్ధంగా ఉన్న వరినార్లు ధ్వంసం కావడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నీలంకాయల కోతలకు సిద్ధంగా ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేయడంతో నష్టపోయామని చిన్న కంపల్లెకి చెందిన బాలాజీనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారులకు బాధిత రైతులు గురువారం ఫిర్యాదు చేశారు. నష్ట పరిహారం అందజేయాలని ఉద్యానశాఖ అధికారులను వారు కోరుతున్నారు.

దాతలూ.. ప్రాణం నిలపరూ

బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న టీడీపీ బూత్ కన్వీనర్ మురళి ● రూ.14 లక్షలు ఖర్చువుతుందన్న వైద్యులు



సీఎంసీలో చికిత్స పొందుతున్న మురళి

చిత్తూరు రూరల్, ఆగస్టు 8: దాతలూ.. సాయం అందించి ప్రాణం నిలపాలని కోరుతున్నారు మురళి. ఈయనది చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు గ్రామం. టీడీపీ బూత్ కన్వీనర్. రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. ఇటీవల చిత్తూరు మార్కెట్‌కు వస్తుండగా కళ్ళుతిరిగి పడిపోయారు. మరో రెండు రోజుల తర్వాత చేతులు, కాళ్లు లాగేస్తున్నట్లు అనిపించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని.. వీటికి సంబంధించి రక్తపరీక్షలకు సీఎంసీకి వెళ్లాలని వైద్యులు సూచించారు. రాణిపేటలోని సీఎంసీలో పరీక్షలు చేయించగా బ్లడ్ క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. రెండో స్టేజ్‌లో ఉందని, వైద్యం చేస్తే బతుకుతాడని ఇందుకు రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తేల్చారు. పనిచేస్తే కానీ కుటుంబానికి అన్నం పెట్టలేని పరిస్థితి తనది. తనతో పాటు భార్య ఇద్దరు ఆడపిల్లలు, తల్లిదండ్రులను పోషించాలి. క్యాన్సర్ కావడంతో ఆలస్యం చేయకుండా అక్కడక్కడ అప్పులుచేసి వైద్యం కోసం సీఎంసీలో చేరారు. కుటుంబ సభ్యులు శక్తికి మించి అప్పులు చేసి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలిసి టీడీపీ నేత చంద్రప్రకాష్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మరింత మంది దాతలు సాయం అందించాలని సోషల్ మీడియాలో అభ్యర్థించారు. దాతలు ముందువస్తే మురళి ప్రాణం నిలబడుతుందని ఆయన తెలిపారు.

వైసీపీ నేతల చెరనుంచి చెన్నేని చెరువుకు విముక్తి



చెన్నేని చెరువును సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



చెరువు ఆక్రమిత భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకం తవ్వుతూ...

గుడుపల్లె, ఆగస్టు 8: గుడుపల్లె మండలం గుండ్లసాగరంలోని చెన్నేని చెరువు ఆక్రమిత భూమికి గురువారం విముక్తి లభించింది. గుండ్లసాగరం సమీపంలోని సర్వే నెం.157లో 14.74 ఎకరాల్లో చెన్నేని చెరువు ఉంది. దీనిపై వైసీపీ నేతలు, కొందరు గ్రామస్తుల కన్నుపడింది. కుప్పానికి చెందిన వైసీపీ నాయకుల అండతో చెరువు భూమిని 12 ఎకరాల వరకు ఆక్రమించేశారు. ఆక్రమిత భూమిలో కొందరు మామిడి, నేరేడు, కొబ్బరి తోటలతో పాటు వివిధ రకాల పంటల సాగు చేపట్టారు. కొన్నేళ్లుగా గ్రామస్తులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కుప్పం వైసీపీ నాయకుల జోక్యంతో రెవెన్యూ అధికారులు ఈ ఫిర్యాదులను చెత్తబుట్టలో పడేశారు. చెరువు ఆక్రమణతో నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో ఆయకట్టుదారులు భూములను బీడుగా ఉంచేశారు. దీనిపై జూలై 21వ తేదీన 'చెరువును చెరబట్టారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టరు సుమిత్ కుమార్ స్పందించారు. ఆక్రమిత చెరువును సర్వే చేసి ట్రంచ్‌ను

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పాటు చేయాలని తహసీల్దారును ఆదేశించారు. దీంతో గురువారం రెవెన్యూ అధికాల బృందం చెన్నేని చెరువుకు చేరుకొన్నారు. ఆక్రమణదారులు అడ్డుకోవడానికి సిద్ధపడ్డారు. సర్వేకు అడ్డుతగిలితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనకడుగు వేశారు. గుండ్లసాగరం సర్వేయర్ జయంత్, వీఆర్వో కుమార్, వీఆర్ఏలతో చెరువును సర్వే చేశారు. సుమారు 12 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమిత చెరువు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకాలను సర్పంచ్ నాగరాజు తవ్వించారు. ఎట్టకేలకు వైసీపీ నాయకుల చెర నుంచి చెన్నని చెరువు భూమి విముక్తి కలగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

సొంత డబ్బుతో సెక్యూరిటీ పెట్టుకోవచ్చుగా!

జగన్‌ను ప్రశ్నించిన మాజీ ఎంపీ చింతా మోహన్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల అధికారంలో ఉన్న ఒక కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలున్న జగన్ సొంతంగా సెక్యూరిటీని పెట్టుకోవచ్చు కదా! అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి తన సెక్యూరిటీ కోసం రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. తమకెవరికీ సెక్యూరిటీ లేదని.. తాము బయట తిరగడం లేదా అని అడిగారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్, చంద్రబాబు ఎంత ఖర్చు చేశారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాలు



అధికారులతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు 8 :పట్టణ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. కౌండిన్య జలాశయం నుంచి సమృద్ధిగా నీరు అందించలేకపోతున్నామన్నారు. గతంలో ప్రతిపాదించిన గంగన్న శిరస్సు అనుబంధ జలాశయం నిర్మాణానికి సమగ్ర నివేదిక అందజేయాలని సూచించారు. పట్టణంలో తాగునీటి సమస్య గురించి డీఈ పుష్పగిరినాయక్, ఏఈ రూపేష్‌లను అడిగి తెలుసుకొన్నారు. టీడీపీ నాయకులు ఖాజాపీర్, కిరణ్‌కుమార్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యలపై ఆర్డీఓకు వినతి



పలమనేరు, ఆగస్టు8 : దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం కేవీపీఎస్ నాయకులు ఆర్డీఓ మనోజ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని, కేటాయించిన బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని,బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రయివేటీకరణ మానుకోవాలని, జాతీయస్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలుచేయాలని, ఉద్యోగ, ప్రమోషన్లలో రాజ్యాంగ రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ నాయకులు ఈశ్వర్, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, పి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ సూర్యనారాయణ

కల్లూరు, ఆగస్టు 8: పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూర్యనారాయణ కోరారు. సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణపై గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చన్నారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలేటమ్మవారికి మొక్కులు చెల్లించిన భక్తులు



సోమల, ఆగస్టు 8: నెల్లిమంద పాలేటమ్మవారి జాతర నేపథ్యంలో గురువారం ఉత్సవ మూర్తిని ఊరేగించారు. అమ్మవారికి, పోతురాజులుకు మహిళలు మంగళ హారతులు పట్టారు. మొక్కులు తీర్చుకున్నారు. పాయల వంశస్థులు అమ్మవారికి పుట్టినింట సాంప్రదాయాలతో సారె, చీర సమర్పించారు. కార్యక్రమాల్లో సీఎం సురేశ్, పాయల చంద్రశేఖర్, నాగరాజ, కోదండయ్య, జగన్‌మోహన్, శివకుమార్, గంగాధరం, రమేశ్ పాల్గొన్నారు.

పంచాయతీల విధి విధానాలపై శిక్షణ



సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న నాగరాజ

రొంపిచెర్ల, ఆగస్టు8: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల విధివిధానాలపై శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. పారిశుధ్యం, నిధుల వినియోగం, బాధ్యతలు, తాగునీరు, పన్నుల సేకరణ, చెత్త నుంచి సంపద తదితర అంశాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈవోపీఆర్‌డీ నాగరాజ, కల్లూరు కార్యదర్శి యుగంధర్‌లు శిక్షణఇచ్చారు.

కొత్త బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న కంచర్ల, తదితరులు

కుప్పం, ఆగస్టు 8: కుప్పం-తిరుపతి ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం ప్రారంభించారు. డిపోలో పూజలు చేసి స్వయంగా బస్సును నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కుప్పం డిపోను మోడల్‌గా మార్చడానికి చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం పెంచలయ్య, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సీఎంఏ నరసింహులు, బలరామ్, కౌన్సిలర్ జిమ్ దాము, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, సత్యేంద్ర శేఖర్, మాజీ సర్పంచి ప్రతాప్, శాంతారాం పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు



రోగులకు చికిత్స చేస్తున్న ప్రభావతి

చౌడేపల్లె, ఆగస్టు8: అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రభావతి పేర్కొన్నారు. గురువారం ఆమె లద్దిగం, కాటిపేరి, చౌడేపల్లె, పుదిపట్ల పంచాయతీలలోని వైద్యశాలలను తనిఖీ చేశారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు: కడా పీడీ



టూరిజం అధికారులతో పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 8: నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కడా పీడీ వికాస్ మర్మత్ టూరిజం శాఖ అధికారులను ఆదేశించారు. కడా కార్యాలయంలో గురువారం ఆయన టూరిజం శాఖాధికారులతో సమావేశమయ్యారు. పీడీ మాట్లాడుతూ ననియాల ఎకో టూరిజం, కంగుంది కోట, మల్లప్ప కొండ, గుడివంక సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలతోపాటు అగస్త్య ఫౌండేషన్ వంటి టూరిజం స్థలాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తే టూరిస్టులు పెరుగుతారన్నారు. టూరిజంతో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. టూరిజం రీజనల్ జాయింట్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డీఈ శ్రీనివాసరెడ్డి, డీటీసీవో మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు 8: కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం కాలేజీ ఆవరణలో వివిధ రకాల మొక్కలను విద్యార్థులతో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల వర్షాలు బాగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరుగు, కబడ్డీ తదితర క్రీడలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 15న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యత

సోమల, ఆగస్టు 8: గ్రామాల్లో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో లక్ష్మీదేవి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఆర్థిక సంవత్సంలో పంచాయతీల్లో నిధుల వినియోగం, అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. ఈవోపీఆర్డీలు వరప్రసాద్, కృష్ణవేణి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ

రామకుప్పం, ఆగస్టు 8: 89 పెద్దూరులో గురువారం టీడీపీ బీసీసెల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మనోహర్ పార్టీ నేతలతో కలిసి స్థానికులకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్, పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు లోకేశ్, బాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కేరళ వరద బాధితులకు ఆర్థిక సాయం

కుప్పం, ఆగస్టు 8: కేరళ వరద బాధితుల సహాయార్థం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ జిమ్ దాము రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేశారు. కుప్పం నియోకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, నాయకులు డాక్టర్ వెంకటేశ్, జాకిర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుప్పం, ఆగస్టు 8: స్థానిక డంపింగ్ యార్డు సమీపంలో గురువారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతునికి సుమారు 50-55 సంవత్సరాల వయసుంటుంది. శరీరం గుర్తుపట్టడానికి వీలులేనంతగా నుజ్జునుజ్జయింది. బ్లూ కలర్ నైట్ ప్యాంటు, క్రీమ్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కోరారు.

11న ఉచిత కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 8 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న మాసన క్లినిక్, పున్నమిబేకరి సహకారంతో చెన్నై ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, చంద్రశేఖర్, చిన్నప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు సేవలందిస్తారన్నారు. కంటిపరీక్షలు జరిపి అవసరమైనవారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటిసమస్యలతో బాధపడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల పంపిణీ

పుంగనూరు రూరల్, ఆగస్టు8: రైతులకు సబ్సిడీ ధరలపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ శివకుమార్ రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం 90శాతం రాయితీలో రూ. 2.18లక్షలకు మించకుండా పరికరాలు అందజేయనుందన్నారు. ఐదు నుంచి పదెకరాలున్న రైతులకు 70శాతం రాయితీతో రూ.3.36 లక్షలకు మించకుండా పరికరాలు ఇస్తామన్నారు. గతంలో తీసుకున్న రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతులు ఆధార్‌కార్డు, 1బి, ఫోన్ నంబర్లతో రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలాల వారీగా పుంగనూరుకు 1400 హెక్టార్లు, సోమలకు 600హెక్టార్లు, పెద్దపంజాణికి 800హెక్టార్లు, గంగవరానికి 600 హెక్టార్లు, చౌడేపల్లెకు 800 హెక్టార్లు, సదుంకు 600హెకార్లు, పులిచెరకు 600 హెకార్లు, రొంపిచెర్లకు 800 హెక్టార్లకు పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు.

తహసీల్దారుగా బాబు బాధ్యతల స్వీకారం

రామకుప్పం, ఆగస్టు 8: మండల తహశీల్దారుగా బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరంగా సమస్యలపై ప్రజల నుంచి వచ్చే వినతులను సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది, రాజకీయపక్షాలు సహకరించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు

గంగవరం, ఆగస్టు 8: పలమనేరు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గంగవరం మండలంలోని పలు గ్రామల్లో గురువారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంజునాథకాలనీ, కీలపట్ల, డ్రైవర్స్‌కాలనీలో యానాది, గిరిజన ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓ మనో రమాదేవి, న్యాయవాదులు యల్.భాస్కర్, షేక్ ఆరీఫుల్లాఖాన్, షేక్ మొహిద్దీన్ లతోపాటు పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 8 : స్థానిక నాలుగురోడ్ల కూడలిలో వివాదస్పద స్థలాన్ని గురువారం సబ్‌డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్వో శివన్న పరిశీలించారు. ఎఫ్ఆర్వో శివన్న మాట్లాడుతూ తమ రికార్డుల ప్రకారం అటవీశాఖకు చెందిన స్థలంలో ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరరక్షించడానికి చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రోడ్డు, తాగునీటి సమస్యలకు పరిష్కారం



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

పుంగనూరు, ఆగస్టు 8: రాంనగర్‌కాలనీలో రోడ్డు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన టీడీపీ నేతలు, అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. 15 ఏళ్లుగా రోడ్డు లేదని, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పారు. త్వరలో రోడ్డు నిర్మించి సమస్య తీర్చుతామని కమిషనర్ తెలిపారు. అదనంగా బోరు వేయిస్తామన్నారు. జగనన్న కాలనీకి కూడా అంతర్గత రోడ్డు నిర్మిస్తామని వివరించారు. టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలు తీర్చుతామని ఇచ్చిన హామీలను చల్లా రామచంద్రారెడ్డి అమలు చేస్తున్నారన్నారు. డీఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు





కుప్పంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో దేవరాజు-పలమనేరులో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఈఓ లీలారాణి



కేశవరెడ్డి, ఆనంద్,బైరప్ప

రామకుప్పం: స్థానిక బాలికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చెర్మన్‌గా మిట్లపల్లె కేశవరెడ్డి, వైస్‌చైర్మన్‌గా ఆనంద్, ఆనిగానూరు స్కూలు చెర్మన్‌గా బైరప్ప ఎన్నికయ్యారు.

పలమనేరు, ఆగస్టు 8 : మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం యాజమాన్య కమిటీ ఎన్నికలు(ఎస్ఎంసీ) ప్రశాంతంగా ముగిశాయి. 59 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత, 9 ఉన్నత, ఒక రెసిడెన్సియల్ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. ఎంపీడీఓ రాజేష్, తహసిల్దార్ అన్పునాథన్, ఎంఈఓలు లీలారాణి, బాలసుందరంలు పలమనేరు బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలను పర్యవేక్షించారు. **కల్లూరు:** పులిచెర్ల మండలంలోని ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. 42 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, 1 గురుకుల పాఠశాలలో అన్ని పదవులూ ఏకగ్రీవమయ్యాయన్నారు. **రొంపిచెర్ల:** మండలంలోని 8 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఎంఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగాయి. ఎన్నికల నిర్వహణలో. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **సోమల:** మండలంలో 42 ప్రాథమిక పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు .**చౌడేపల్లె:**మండలంలోని 77 స్కూల్స్‌లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో కేశరెడ్డి పేర్కొన్నారు. 34 స్కూల్స్‌లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. **కుప్పం:** మున్సిపల్, రూరల్ మండల పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగాయి. డీఈవో దేవరాజుపాల్ పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. వసనాడుననియాల పాఠశాలలను కూడా సందర్శించారు. **శాంతిపురం :** కనమలదొడ్డి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడటంతో ఎన్నిక వాయిదా పడిందని హెచ్‌ఎం షర్మిల తెలిపారు. **బైరెడ్డిపల్లె :** కీలతొరడిలో ఎన్నిక వాయిదా పడింది. 63 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 10 జడ్పీ ఉన్నత గురుకుల, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి.

అవినీతి,అక్రమాలపై విజిలెన్స్ విచారణ

- మండల సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల
- హాజరుకాని అధికారులకు నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, ఆగస్టు 8 : రెవెన్యూ శాఖలో అత్యధికంగా జరిగిన అక్రమాలపై శాంతిపురం మండలం నుంచే ఎక్కువ ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు. గురువారం మండల సచివాలయంలో ఎంపీపీ వసుంధర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీలో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. సెరికల్చర్ శాఖలో చాపకింద నీరులాగా సుమారు రూ.200 కోట్ల మేర అవినీతి జరిగినట్లు సమాచారం అందిందన్నారు. అక్రమాలు, అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రాథమిక సమాచారాన్ని ప్రజా ప్రతినిధులకు చేరవేయడంలో నిర్లక్ష్యం తగదని ఆయన అధికారులను మందలించారు. కొన్ని శాఖల అధికారులు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో మైథిలిని ఆదేశించారు. మండలానికి సీఎం రూ.5 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్సీ శ్రీకాంత్ తెలిపారు. అందులో 50 శాతం నిధులను అత్యవసర పనులకు ఖర్చు చేయాలన్నారు. అంతకుముందు సర్పంచులు పలు సమస్యలను ప్రస్తావించారు. వారు చెప్పిన సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. జడ్పీటీసీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు సరస్వతి, పట్టాభి, కో-ఆప్షన్ సభ్యులు నిషార్, జయరాం, ఎంపీడీవో డాక్టర్ మైథిలి, శివయ్య పాల్గొన్నారు.

కంటి సమస్యలపై 15లోపు సర్వే పూర్తి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సుమిత్ కుమార్

కుప్పం, ఆగస్టు 8: నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలపై సర్వే ఈనెల 15లోగా పూర్తి కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండల సచివాలయంలో గురువారం ఆయన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంటి సమస్యల సర్వే 95 శాతం పూర్తయిందన్నారు. ఈనెల 15లోగా పూర్తి చేసి సర్వే జాబితా సమర్పించాలన్నారు. సమస్యలు ఉన్నవారికి స్క్రీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇందులో ఏఎన్ఎంలు కీలక బాధ్యత వహించాలన్నారు. వెలుగు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత, వైద్యాధికారులు, టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పడండి: ఎమ్మెల్యే అమర్



కొత్తగా ఎన్నికైన పాఠశాల కమిటీ ఛైర్మన్లతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు ఆగస్టు 8: పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ సభ్యులు తోడ్పడాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. గురువారం పాఠశాలల విద్యా కమిటీలు ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికైన పాఠశాలల విద్యాకమిటీ ఛైర్మన్లు పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యేను కలిశారు. శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. ఛైర్మన్లుగా ఎంపికైన వారికి ఆయన పూలమాలలు వేసి అభినందించారు. ప్రతి పాఠశాలలో విద్యా కమిటీలు విధిగా సందర్శించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎమ్మెల్యే చెప్పారు. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, నాయకులు రాంబాబు, ఈశ్వర్‌గౌడ, సోమశేఖర్, నాగభూషణం, రాము, విశ్వనాథ్, కోదండ, జనార్ధన్, శబరీష్ తదితరులు పాల్గొన్నారు. **వి.కోట:** పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయనను స్థానిక పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు, రాంబాబు, నేతలు ఈశ్వర్, శబరీష్, నాగభూషణం, నారాయణస్వామి, కోదండరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ క్లస్టర్ గేమ్స్ చాంపియన్‌గా చిత్తూరు



ట్రోఫీ అందిస్తున్న జేఎన్‌వీ అధ్యాపకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో నిర్వహించిన క్లస్టర్ గేమ్స్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె మండలం వలసపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజులుగా నిర్వహించిన క్లస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కరైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, ప్రకాశం-2, పుదుచ్చేరి జిల్లాలకు చెందిన 9 విద్యాలయాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం హర్డిల్స్ రిలే పరుగుపందెం, ఐదు కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ, 5 కిలోమీటర్ల నడక పందేలు నిర్వహించగా చిత్తూరు జిల్లా జట్టు (మదనపల్లె నవోదయ విద్యాలయ) మొత్తం 451 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. 84 పాయింట్లతో ద్వితీయ స్థానం నెల్లూరు జేఎన్‌వీ, 67 పాయింట్లతో కడప జేఎన్‌వీ తృతీయ స్థానంలో నిలిచింది. క్లస్టర్ విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు ఈనెల 12వ తేదీ మదనపల్లె జేఎన్‌వీలో మూడు రోజుల పాటు నిర్వహించే హైదరాబాద్ రీజనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ) స్థాయిలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ క్రీడా పోటీల్లో చిత్తూరు క్లస్టర్ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్, పీడీలు సురేంద్రరెడ్డి, కొఠాయి, విద్యార్థులు పాల్గొన్నారు.



రయ్‌మంటూ మైనర్ల దూకుడు

నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కల్లూరు జాతీయ రహదారిపై మైనర్లు ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో వెళుతున్నారు. పదిహేనేళ్లు కూడా నిండని బాలురు ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురితో కలిసి సవారీ చేస్తున్నారు. 100 సీసీ నుంచి 200 సీసీ వరకు హైస్పీడ్ ద్విచక్ర వాహనాలను నడుపుతూ వారు కొన్ని సందర్భాల్లో నియంత్రించలేక పోతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్నారు. గురువారం ఉదయం 15 ఏళ్లు కూడా నిండని నలుగురు పిల్లలు ఒకే వాహనంపై తిరుగుతుండటాన్ని చూసి ప్రజలు ఆందోళన చెందారు. ఇలాంటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసులను కోరుతున్నారు. -కల్లూరు

రెస్కోలో విద్యుత్ అదాలత్



కుప్పం, ఆగస్టు 8: స్థానిక రెస్కో ప్రధాన కార్యాలయంలో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. అదాలత్ అధ్యక్షులు వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు కె.రామమోహన్‌రావు, ఎస్.ఎల్.అంజనీకుమార్, జి.ఈశ్వరమ్మల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సరైన ప్రచారం లేకపోవడంతో పరిమిత సంఖ్యలో వినియోగదారులు వచ్చారు. రెస్కో డీఈలు మదన్‌మోహన్, ప్రభాకర్‌తోపాటు ఏడీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న మాల మహానాడు కమిటీ ఎన్నిక

చౌడేపల్లె, ఆగస్టు11: ఈనెల 11న మాల మహానాడు మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు కమిటీ సభ్యులు ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో కమిటీని ఎన్నుకుంటామన్నారు. మణి, సురేష్, ముకుందా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ



పుంగనూరు రూరల్, ఆగస్టు8: పుంగమ్మచెరువు కట్ట, కొత్తయిండ్లులో షిరిడిసాయిబాబా గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ అర్చకులు స్వామివారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

సోమల, ఆగస్టు 8: స్థానిక సాయినగర్‌లో కొలువుదీరిన సాయిబాబా ఆలయానికి గురువారం గన్నా లక్ష్మయ్య రూ.15 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ కార్యదర్శి నాగరాజుకు అందజేశారు. ఈనేపథ్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులపై సెల్‌ఫోన్ల దుష్ప్రభావం

పుంగనూరు రూరల్, ఆగస్టు8: విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎంఈవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వడం వల్ల చెడుమార్గాల్లో వెళ్లడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కొత్త కమిటీలు పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆదర్శవంతంగా పని చేయండి

పలమనేరు ఆగస్టు 8: ఆదర్శవంతంగా పని చేయాలని కొత్తగా ఎంపికైన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు గురువారం తన కార్యాలయంలో ఆయన నియామక పత్రాలను అందజేశారు. అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని, బైరెడ్డిపల్లె ప్రాజెక్టు సూపర్‌వైజర్లు రమాదేవి, లత, సుజాత, సిబ్బంది,తదితరులు ఉన్నారు.

వర్షంతో ఉపశమనం

వి.కోట, ఆగస్టు 8: మండల కేంద్రంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సాయంత్రం వేళ సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. బుధవారం మండల పరిధిలో 83.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గురువారం కూడా బాగానే వర్షం కురిసింది. రైతన్నలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కల్పించింది.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 8: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని ఒకటవ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య వివరాల మేరకు.. నగరంలోని ఎంజీఆర్ వీధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. జిలాని, బాలాజీలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 15 లీటర్ల మద్యం సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపించారు.

ఇద్దరు లాటరీ విక్రేతల అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 8: చిత్తూరులో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని ఒకటవ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పాత బస్టాండ్‌లో లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. ప్రకాష్ బాబు, నరేష్ అనే ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి లాటరీ టికెట్లు, రూ.7,170 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయండి


నేషనల్ అడిషనల్ కమిషనర్ మీనాతో చేనేత రాష్ట్ర నాయకులు

పెనుమూరు, ఆగస్టు 8: చేనేతలకు సంబంధించి వర్క్‌షెడ్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని నేషనల్ అడిషనల్ కమిషనర్ డీఎల్ మీనాను రాష్ట్ర చేనేత యూనియన్ నాయకులు గురువారం కోరారు. ఢిల్లీలోని ఉద్యోగ భవన్‌లో రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగవర్మ, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, సత్యసాయి జిల్లా నేతలు తలారి ఆంజనేయులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. 10 రోజుల్లో విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు చెప్పారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నాగపద్మిని

వెదురుకుప్పం, ఆగస్టు 8: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని తెలిపారు. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట వద్ద గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏఈవోలు గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే ఉద్యోగులు మునికృష్ణ, సుమ, కుసుమ, కల్పన, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు సబిత, నళిని పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజుల తిరునాళ్ల


ప్రత్యేకాలంకరణలో ద్రౌపదీదేవి

నగరి, ఆగస్టు 8: చింతలపట్టెడలో ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, కుంకుమ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి ప్రత్యేక రథంపై శ్రీకృష్ణుడి ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు, హారతులు సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం ఉభయదారుడిగా వ్యవహరించారు. ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.17.63 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తవణంపల్లె, ఆగస్టు 8 : మండలంలోని అర్ధగిరి వీరాంజనేయస్వామికి హుండీ కానుకల ద్వారా రూ.17.63 లక్షలు వచ్చినట్లు ఈవో హనుమంతరావు తెలిపారు. బుధవారం ఈవో ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. 135 రోజులకు గానూరూ.17,63,301 నగదు, బంగారు 11 గ్రాములు, వెండి 386 గ్రాములు, అమెరికా డాలర్లు 67, సౌదీ రియల్స్ 15, కువైట్ దినార్లు 1/4 లభించినట్లు ఈవో వివరించారు. దేవాదాయశాఖ అధికారి మునిరాజు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తకు రోజా పరామర్శ


వైసీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న రోజా

నింద్ర/నగరి, ఆగస్టు 8: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న నింద్ర మండలం వైఎస్ కండ్రిగ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త పవన్ కుమార్‌ను మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నగరిలోని హనీఫా హోటల్ యజమాని ఫాజిల్ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఫాజిల్ భార్య ఇటీవల మరణించడంతో రోజా వారి ఇంటికెళ్లి వివరాలు తెలుసుకుని, ధైర్యం చెప్పారు. కౌన్సిలర్ బీడీ భాస్కర్, సలీమ్ ఆమె వెంట ఉన్నారు.

నామినేటెడ్ పోస్టు ఇవ్వండి : జనసేన యుగంధర్



వెదురుకుప్పం, ఆగస్టు 8: జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ మంగళగిరిలో శాసన మండలి సభ్యుడు హరిప్రసాద్‌ను కలిశారు. అలాగే జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను కలిసి తగిన నామినేటెడ్ పోస్టు కోరినట్లు యుగంధర్ తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ



గుడిపాల, ఆగస్టు 8: మండలంలోని బట్టువాళ్లవూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుబ్రహ్మణ్యం నాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

గుడిపాల, ఆగస్టు 8: మండలంలోని కుప్పిగానిపల్లెలో బుధవారం రాత్రి మోటారు సైకిల్ చోరీకి గురైంది. ఇంటి వద్ద నిలిపి ఉంచిన బైక్‌ను తీసుకెళ్లారని బాధితుడు సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

గుడిపాల, ఆగస్టు 8: మండలంలోని పానాటూరు సమీపంలో పట్టుబడిన ఇసుకకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. తమిళనాడుకు చెందిన మంజునాథ్, గజేంద్ర, కుమార్, శరత్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి జేసీబీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు




తవణంపల్లెలో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంపీడీవో - నింద్రలో రమేష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు - నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఢిల్లీబాయ్

నగరి, ఆగస్టు 8: నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలోని 67 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 59 ఏకగ్రీవం కాగా 28 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా టీడీపీ మద్దతుదారులు చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

పెనుమూరు : మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలు 6, మండల పరిషత్ 57 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పెనుమూరులో మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు, హెచ్‌ఎం వెంకటేశులునాయుడు పరిశీలనలో కమిటీని ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మునేంద్రబాబు, వైస్ చైర్మన్‌గా పూజిత, కోఆప్షన్ సభ్యులుగా పరమేశ్వర్‌రెడ్డి, తలారిరెడ్డెప్పలను ఎన్నుకున్నారని ఎంఈవో భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు.

యాదమరి : మండలంలోని కె.గొల్లపల్లె ప్లస్ పాఠశాల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా నవీన్‌కుమార్, వైస్ చైర్‌పర్సన్‌గా ఆమని ఎన్నికయ్యారు. పరిశీలకులుగా తహసీల్దార్ పార్థసారథి హాజరయ్యారు. యాదమరి ఉన్నత పాఠశాల చైర్‌పర్సన్‌గా రేవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తవణంపల్లె : మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి జయప్రకాష్‌నాయుడు కోరారు. ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నింద్ర : కొప్పేడు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో తప్ప మిగిలిన పాఠశాలల్లో ఎన్నికలు ముగిసినట్లు ఎంఈవోలు వసుమతి, శ్రీదర్‌రాజు తెలిపారు. నింద్ర ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వెంకటేశులు, అత్తూరు ఉన్నత పాఠశాల చైర్మగా రమేష్, చవరంబాకం ఉన్నత పాఠశాల చైర్మగా సుజాత, అరూరు ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పయణి, శ్రీరామపురం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల చైర్మగా జానకీదేవి ఎన్నికయ్యారు.

గుడిపాల : మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈవోలు గణపతి, రఘురామ్ తెలిపారు. నరహరిపేట అధ్యక్షుడిగా ఢిల్లీబాయ్, ఉపాధ్యక్షుడిగా సతీష్, చిత్తపార హైస్కూల్ చైర్మన్‌గా రమేష్, ఉపాధ్యక్షుడిగా భువనేశ్వరి, శ్రీరంగంపల్లె హైస్కూల్ అధ్యక్షుడిగా రంజిత్‌బాబు, ఉపాధ్యక్షుడిగా అభిసెల్వి, కమ్మతిమ్మాపల్లె హైస్కూల్ అధ్యక్షుడిగా లోకయ్య, ఉపాధ్యక్షుడిగా మీనా, ఏఎల్‌పురం హైస్కూల్ అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షుడిగా బిందు, బొమ్మసముద్రం హైస్కూల్ చైర్‌పర్సన్‌గా రాణి, ఉపాధ్యక్షురాలిగా స్వప్న ఎన్నికయ్యారు. నరహరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కాతుంబి పాల్గొన్నారు.

పూతలపట్టు : పూతలపట్టు ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా పేటపల్లెకు చెందిన నేతాజీ, వైస్ చైర్మన్‌గా కళావతి ఎన్నికయ్యారు. పోలవరం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా లోకేశ్వరి, వైస్ చైర్మన్‌గా ఢిల్లీబాబు ఎన్నికయ్యారు.

శ్రీరంగరాజపురం : పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా టీడీపీ మైనారిటీ సెల్ మండల కార్యదర్శి మహబూబ్ బాషాను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం హేమాద్రి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయపురం : మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. తరగతుల వారీగా సభ్యులను, మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఎంఈవో హరిప్రసాద్‌వర్మ తెలిపారు.

గంగాధరనెల్లూరు : మండలంలో 103 పాఠశాలలు ఉండగా ఉండగా 55 స్కూళ్లల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈవో ఆంజినేయులుశెట్టి తెలిపారు. మిగిలిన 48 పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ఎన్నుకున్నారని చెప్పారు. రెండవ ఎంఈవో గుణశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎంలు, టీడీపీ నేతలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, టీచర్లు పాల్గొన్నారు.


నగరిలో ఎన్నికైన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు

పాలసముద్రం : మండలంలోని 27 ప్రాథమిక పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. సింహరాజుపురం ప్రాథమిక పాఠశాల ఎన్నికలు మాత్రం కోరం లేక వాయిదా పడ్డాయి. ఎస్ఆర్ కండ్రిగ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా రంజిత్‌కుమార్, తిరుమలరాజుపురం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎం.పయణి, వెంగళరాజుకుప్పం హైస్కూల్ చైర్మన్‌గా రాధిక, ఆముదాల హైస్కూల్ చైర్మన్‌గా రాబర్ట్, పాలసముద్రం హైస్కూల్ చైర్మన్‌గా గోపాలన్ ఎన్నికైనట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బంగారుపాళ్యం : మండలంలోని 80 ప్రాథమిక, నాలుగు ఉన్నత, 11 ఎయిడెడ్ పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాలకు ఎన్నికలు నిర్వహించి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఎన్నుకున్నట్లు ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబులు తెలిపారు. ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాగణపతి ఆలయ కుంభాభిషేకం



చిత్తూరు రూరల్, ఆగస్టు 8: చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీ కమ్మపల్లిలో గురువారం మహాగణపతి ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు పాల్గొని, పూజలు చేయించారు. వారిని ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

చెత్త నుంచి సంపద సృష్టించండి

పాలసముద్రం, ఆగస్టు 8: గ్రామాల్లో చెత్త సేకరించి, ఎరువుగా మార్చి పంచాయతీలకు సంపదను సృష్టించుకోవాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలనే దానిపై అవగాహన కల్పించారు. శ్రీకావేరిరాజుపురం డంపింగ్ యార్డులో ఎరువు తయారు చేసే విధానాన్ని డెమోగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ భజన మందిరం మహాకుంభాభిషేకం


కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

పాలసముద్రం, ఆగస్టు 8: మండలంలోని వనదుర్గాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ భజన మందిరం మహాకుంభాభిషేకం శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం సాయంత్రం యాగశాలలో 108 కలశాలు ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు. అగ్నిగుండాలు, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కె.బాబు రాజు, ఎంపీపీ శ్యామల శివప్రకాష్ రాజు పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



విజయపురం, ఆగస్టు 8: మండలంలో గురువారం నుంచి పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. కేవీపురం, మల్లారెడ్డికండ్రిగ, కళియంబాకం, పన్నూరు, మాధవరం పంచాయతీల్లో రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు, వీధులను శుభ్రం చేయడం వంటి పనులు చేపట్టారు. ఈవోపీఆర్డీ బాబు,. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి

● 'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు 34 ఫిర్యాదులు


ఫోన్ ద్వారా ఫిర్యాదులు తీసుకుంటున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, ఆగస్టు 8: డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఆయన ఫోన్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. గత వారం అందిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించారు.. మిగిలినవి పరిష్కరించకపోవడానికి కారణాలేమిటి అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి 34 ఫిర్యాదులు అందాయని కమిషనర్ అరుణ చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని బీజేపీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ వారం రోజుల పాటు చేపట్టనున్న హర్ ఘర్ తిరంగా అంశంపై మాట్లాడారు. విద్యార్థి, యువజన, మహిళలతో ర్యాలీలు, సభలు, మొక్కల పెంపకం, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించడం, ప్రతి ఇంటిపైనా జెండా ఎగురవేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలి పారు. ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎంపీ దుర్గ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, చిత్తూరు సెంట్రల్ మండలాధ్యక్షుడు షణ్ముగం, వెంకటముని, రామభద్ర పాల్గొన్నారు.

చిత్తూరులో కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖ ప్రారంభం


కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖను ప్రారంభిస్తున్న జీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

చిత్తూరు, : ఫైనాన్స్ రంగంలో 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్ నూతన శాఖను చిత్తూరులోని డీఐ రోడ్డులో గురువారం ఉదయం ప్రారంభించినట్లు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందన్నారు. తమ సంస్థ రూ.5 వేల నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకూ అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి తమ సంస్థ ఎంతగానో దోహదపడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎం నరసింహులు, బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌కుమార్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ క్లస్టర్ గేమ్స్ చాంపియన్‌గా చిత్తూరు


చిత్తూరు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జేఎన్‌వీ అధ్యాపకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో నిర్వహించిన క్లస్టర్ గేమ్స్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె మండలం వలసపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన క్లస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కర్నైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, ప్రకాశం-2, పుదుచ్చేరి జిల్లాలకు చెందిన 9 విద్యాలయాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం హర్డిల్స్, రిలే పరుగుపందెం, ఐదు కిలోమీటర్ల క్రాస్ కంట్రీ, 5 కిలోమీటర్ల నడక పందేలు నిర్వహించగా చిత్తూరు జిల్లా జట్టు (మదనపల్లె నవోదయ విద్యాలయ) మొత్తం 451 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. 84 పాయింట్లతో ద్వితీయ స్థానం నెల్లూరు జేఎన్‌వీ, 67 పాయింట్లతో కడప జేఎన్‌వీ తృతీయ స్థానంలో నిలిచింది. క్లస్టర్ విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు ఈనెల 12వ తేదీ మదనపల్లె జేఎన్‌వీలో మూడు రోజుల పాటు నిర్వహించే హైదరాబాద్ రీజనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ) స్థాయిలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ క్రీడా పోటీల్లో చిత్తూరు క్లస్టర్ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్, పీడీలు సురేంద్రరెడ్డి, కొరాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నగరి, ఆగస్టు 8: నగరిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, మైనింగ్, క్వారీలపై ప్రభుత్వ అధికారుల అజమాయిషీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య కోరారు. ఈ మేరకు గురువారం కొత్త తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మారినా అక్రమార్కులు చెలరేగిపోతున్నారని, మట్టి, మైనింగ్ క్వారీలను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన విస్తీర్ణం కన్నా అధికంగా తవ్వకాలు జరిపి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులు విజయ్ కుమార్, శేఖర్, రాజేంద్ర ఏఐటీయూసీ నాయకులు మురళి, సిరాజుద్దీన్, ఏసుదాసు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

11న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

నగరి, ఆగస్టు 8: ఈనెల 11వ తేదీన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేయనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 8 గంటలకు జిల్లా సబ్ జూనియర్స్, సీనియర్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ పోటీలకు 2009 జనవరి 2, జూనియర్స్ పోటీలకు 2005 జనవరి 2వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 7013754776, 9052860009లను సంప్రదించాలని బాలాజీ కోరారు.

వైద్యశిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో


బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి

బంగారుపాళ్యం, ఆగస్టు 8: స్థానిక దళితవాడలో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంపును గురువారం జిల్లా వైద్యాధికారి ప్రభావతి దేవి సందర్శించారు. బంగారుపాళ్యం దళితవాడలో కొందరికి వాంతులు, విరేచనాలు కావడంతో అదే గ్రామానికి చెందిన పాఠశాల, సచివాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి బాధితులకు వైద్యం అందిస్తున్నారు. ఈ శిబిరాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో బాధితుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని, ఇంటింటి సర్వే చేయాలని, క్లోరినేషన్, శానిటేషన్ చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి శాంపిల్‌ను తిరుపతిలోని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రిపోర్టులు వచ్చాక తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, సర్పంచ్ ఉమాదేవి, డాక్టర్ లోహిత్, డాక్టర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ క్వార్టర్స్

● ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోని వైనం
● బీటలు వారి పిచ్చి మొక్కలు మొలిచినా పట్టించుకోని యంత్రాంగం


భవనంపై మొలిచిన మొక్కలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ క్వార్టర్స్ భవనం శిథిలస్థితికి చేరి, కూలేందుకు సిద్ధంగా ఉంది. 40ఏళ్ల క్రితం గంగాధరనెల్లూరు పంచాయతీ సమితి కేంద్రంగా ఉన్నపుడు డీసీసీబీ బ్రాంచ్ గేట్‌కు ఎదురుగా అల్లియల్లమ్మ గుడి వెనుకభాగంలో బీడీవో (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)కు, పంచాయతీ విస్తరణాధికారికి వేర్వేరుగా ప్రభుత్వ క్వార్టర్స్ భవనాలను నిర్మించారు. ఈ రెండు భవనాల్లో ఒకటి ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా మారింది. వర్షాలకు ఉరుస్తూ, భవనం చుట్టుపక్కల మొత్తం బీటలు వారిపోయి, మోల్డింగ్ పెచ్చులు ఊడిపోయింది. భవనం పైభాగంలో, చుట్టుపక్కల పిచ్చి మొక్కలు మొలిచి విషసర్పాలకు నిలయంగా మారింది. మరొక భవనాన్ని రైతుభరోసా కేంద్రానికి సంబంధించి పరికరాలు, ఇతరత్రా సామగ్రి పెట్టుకోవడానికి వినియోగిస్తున్నారు. ఇందులో కొంత భాగం హార్టికల్చర్ కార్యాలయంగా మూడేండ్లకు పైగా ఉపయోగపడుతోంది. ఈ భవనం చుట్టుపక్కల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిలస్థితిలో ఉన్న భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని అటు ఉద్యోగులు, ఇటు స్థానికులు కోరుతున్నారు.


శిథిలస్థితిలో ఉన్న క్వార్టర్స్ భవనం (ఇన్‌సెట్) భవనం చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలు